క్లుప్తంగా

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న ప్రతి విద్యార్థి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ కేఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుంచే సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంగా విద్యలో వెనుక బడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం విద్యలో రాణించిన విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రముఖులకు ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: ఉగాది పురస్కరించుకుని ఈనెల 22న ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నట్లు అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం తెలిపారు. కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. అరండల్‌పేట 7వ లైనులోని ఆవోపా కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నోరి నారాయణమూర్తి పంచాంగశ్రవణం ఉంటుందని తెలిపారు. అనంతరం సభా కార్యక్రమంలో పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావుకు జీవిత సాఫల్య పురస్కారం, రచయిత చిట్టిప్రోలు వెంకటరత్నానికి కవిరత్నం పురస్కారం, మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి సత్యనాగమోహన్‌కు పురస్కారం అందించి సత్కరించనున్నట్లు వివరించారు. అనంతరం కార్యక్రమం ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు పి.రాంబాబు, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, కె.వి.ఎస్.సుధాకర్, బి.ఎల్.ఆదినారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛత అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డును నగరపాలక సంస్థ తరఫున అందజేయనున్నామని, ఇందుకు ఆసక్తి కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త విభజన, చెత్తతో కళాకృతుల తయారీ, తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ విభాగాలలో కృషి చేస్తున్న మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుల్ని ఈనెల 23న నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ప్రజారోగ్య విభాగంలోని ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవీంద్ర నాయక్‌కు అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అవార్డు ప్రదానం చేస్తామని వెల్లడించారు. వివరాలకు నగరపాలక సంస్థ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ (93460 42251)ను సంప్రదించాలని సూచించారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చాటాలి

నెహ్రూనగర్: కేరళలో మే 1 నుంచి 6 వరకు జరగనున్న ఆసియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ -2023 పోటీల్లోనూ గోల్డ్ మెడల్ సాధించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు లిఫ్టర్ నాగం జ్ఞానదివ్యకు సూచించారు. నగరపాలక సంస్థలోని తన కార్యాలయంలో సోమవారం మేయర్ జ్ఞానదివ్యను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లెబోయిన శ్రీవల్లి, బూసి రాజలత, కోచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు 'వాక్ ఫర్ వాటర్' ర్యాలీ

నెహ్రూనగర్: సమస్త జీవకోటికి నీరు ప్రాణాధారమని నగర మేయర్ కావటి శివనాగ మనోహరనాయుడు తెలిపారు. మార్చి 21న ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో మంగళవారం నాజ్ సెంటర్‌లోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్ నుంచి హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్ వరకు వాక్ ఫర్ వాటర్ ర్యాలీ నిర్వహించనున్నారు. తన చాంబర్‌లో సోమవారం మేయర్ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. పక్షులు, జంతువులకు వేసవిలో నీటి వనరులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. నీటి ప్రాధాన్యతను తెలియజేయడానికి మంగళవారం ఉదయం నగరంలో నిర్వహించనున్న ర్యాలీని పట్టణ ప్రజలంతా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లెబోయిన శ్రీవల్లి, బూసి రాజలత, దాసరి లక్ష్మీదుర్గ, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, సీనియర్ గ్రీన్ కోర్ జిల్లా కో- ఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, జె. రామారావు పాల్గొన్నారు.

తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంతో అదనపు ఆదాయం

ఏపీ ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యు.సుధ



రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏపీ ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుధ

గుంటూరు రూరల్: రైతులు పంటలతో పాటు తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యు.సుధ తెలిపారు. సోమవారం వట్టి చెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం ఫౌండేషన్ లో రైతులకు తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు అన్ని పంటల్లో లాభాలు ఆర్జించలేకపోతున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో పంటలకు తోడుగా ఇటువంటి చిన్నపాటి తేనెటీగలు పెంపకం, పుట్టగొడుగులు వంటివి అదనపు ఆదాయాన్ని అందించేవాటిలో ముందు వరుసలో ఉన్నాయన్నారు. వీటి పెంపకం ద్వారా పంటల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. అదేవిధంగా సేంద్రియ వ్యవసాయంలో వినియోగించే కషాయాలు, రసాయనాల తయారి గురించి మేనేజర్ ప్రసాదరావు వివరించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన రైతు సుందరరాజన్, సేంద్రియ రైతు శివనాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

యానాది కాలనీ వాసులతో అధికారుల భేటీ



నంబూరు శివదుర్గ యానాది కాలనీ వాసులతో సమావేశమైన అధికారులు

పెదకాకాని: ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ఫలాలు శివదుర్గ యానాది కాలనీ వాసులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మండల అభివృద్ధి అధికారి బీవీ మల్లేశ్వరరావు అన్నారు. నంబూరు శివారు శివదుర్గ కాలనీలో సోమవారం రాత్రి అధికారులు బృందం సమావేశం ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.హరిహరన్, డిప్యూటీ డైరెక్టర్ (గ్రౌండ్ వాటర్), నియోజకవర్గ ప్రత్యేక అధికారి వందనం, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు కాలనీ వాసులతో మాట్లాడారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కాలనీ వాసులు ఒక చోట స్థిరంగా నివశించకపోవడం వల్ల రేషన్, ఆధార్‌కార్డులు పొందలేకపోతున్నారని తెలిపారు. పెదకాకానిలో ఇప్పటికే 62 కుటుంబాల్లో 45 మందికి ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలానే కాలనీలో ఉన్న వారందరికీ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని.. ప్రతి ఒక్కరూ పిల్లల్ని చదివించి ప్రయోజకుల్ని చేయాలన్నారు. కాలనీలోని మహిళల్ని పొదుపు సంఘాలుగా ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామన్నారు. పనులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ప్రతిరోజూ అధికారులు స్థానికంగా పనులు చూపించడం జరుగుతుందన్నారు. కాలనీ వాసులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పేదరికం, వివక్ష నిర్మూలనతోనే అభివృద్ధి

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: పేదరికం, వివక్షత నిర్మూలనతోనే సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమని ఏఎన్‌యూ వీసీ పి. రాజశేఖర్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'కమ్యూనిటీ హెల్త్ అండ్ సస్టైనబులిటీ డెవలప్‌మెంట్ గోల్స్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును సోమవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతి, ఆరోగ్యంపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. సామాజిక న్యాయం, భద్రత కల్పించినపుడు అందరూ సమానమైన మానసిక సమతుల్యత కలిగి ఉంటారని తెలిపారు. మంగళగిరి ఎన్నారై ఆస్పత్రి కమ్యూనిటీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అధ్యాపకులు డాక్టర్ సీహెచ్. కళ్యాణ్‌రావు కీలకోపన్యాసం చేస్తూ సమాజంలోని అన్ని వర్గాల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ప్రజారోగ్య విభాగం చాలా ముఖ్యమైనదన్నారు. దేశ, ఆర్థిక శ్రేయస్సులో ఈ అంశం చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు, ఢిల్లీకి చెందిన హ్యూమన్ బిహేవియర్, అల్‌లైడ్ సైన్సెస్ సంస్థ సైకియాట్రిక్ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య జహనారా ఎం. గజేంద్రగడ్, మచిలీపట్నానికి చెందిన రచయిత, ఆర్థికవేత్త డాక్టర్ ఐ. సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

నెహ్రూనగర్ : అణగారిన కులాల వారంతా ఐక్యతతో అంబేడ్కర్ బాటలో ఉద్యమాలు చేయాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. అరండల్‌పేటలోని మినీ అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఎస్‌బీఐ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన సునీల్ మేడికొండ అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రకాష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలను అనుసరిస్తూ దళిత, బహుజనులు విద్య ద్వారా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ మద్దు ప్రేమ జ్యోతిబాబు, జెడ్పీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ నేత అంకం శ్యాం, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు. సీనియర్ దళిత మహిళా ఉద్యమ నాయకురాలు మేడం బుజ్జి, భీమ్ భారత్ రాష్ట్ర నాయకులు జల్లి మోహన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు తక్కెళ్లపాడు ప్రాజెక్ట్ ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం జీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు

పెదకాకాని: విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని తక్కెళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం జీఎం శ్రీనివాసరెడ్డి అభినందించారు. తక్కెళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని కె.పద్మావతి గైడ్‌గా వ్యవహరిస్తూ 9వ తరగతి చదువుతున్న ఎస్‌కే యూసుఫ్ అలీషాను ప్రోత్సహించారు. ఈ ఏడాది జనవరి 22వ తేదీ నిర్వహించిన ఆన్‌లైన్ ఇన్‌స్పైర్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 2,700 మంది విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించగా వాటిలో 319 ప్రాజెక్ట్‌లను జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక చేశారు. అలా ఎంపిక చేసిన వాటి నుంచి 30 ప్రాజెక్ట్‌లు రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికయ్యాయి. వాటిలో తక్కెళ్లపాడు విద్యార్థి ప్రదర్శించిన లోకాస్ట్ వాషింగ్‌మిషన్ ఒకటి. రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక కావడంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయిని కె.పద్మావతి, విద్యార్థి ఎస్‌కే యూసఫ్ అలీషాను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీస్ ఉద్యోగం కత్తిమీద సాములాంటిది



ఎస్ఐ రవీంద్రబాబు దంపతులకు సన్మానం

కాకుమాను: పోలీసు ఉద్యోగం అంటేనే కత్తి మీద సాము లాంటిదని.. అలాంటి ఉద్యోగాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు ఎస్ఐగా బదిలీ అయిన దాసరి రవీంద్రబాబుకు ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ కల్యాణ మండపంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. రెండేళ్లుగా కాకుమాను ఎస్ఐగా విధులు నిర్వహించి, మండలంలో శాంతి భద్రతలను కాపాడండంలో రవీంద్రబాబు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, గేరా పున్నారావు, ప్రత్తిపాడు ఏఎంసీ వైస్ చైర్మన్ మెరిగల రవిబాబు, సర్పంచ్ సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, నలిగల యెషయ్య, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల వేంకటేశ్వరాలయంలో ఉగాది ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పంచాగ శ్రవణం జరుగుతుందన్నారు. కోలాటం, భజన కార్యక్రమాలు ఉంటాయని, స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. కావున భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రాహుకేతువు పూజలకు ఏర్పాట్లు



పెదకాకాని శివాలయంలో ఏర్పాట్లు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో రాహుకేతువు మండపం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, పందిర్లు ఏర్పాటు చేసినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో నిర్మించిన రాహుకేతువు మండపంలో అమావాస్య, మంగళవారం అధిక సంఖ్యలో భక్తుల పూజలు చేసేందుకు తరలివస్తారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పందిళ్లు, క్యూలైన్లు, తాగునీరు ఏర్పాటు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 5 నుంచి ఈ పూజలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం రాహుకాల సమయం 3 గంటలకు కూడా గ్రహ దోషాలు ఉన్న వారు రాహుకేతు గ్రహ పూజలు జరిపించుకొనుటకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు.

22న పంచాగ శ్రవణం..

పెదకాకాని శివాలయంలో ఈ నెల 22న బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం కావడంతో పంచాంగ శ్రవణం జరుగుతుందన్నారు. ఆలయంలో సాయంత్రం 4 గంటలకు దేవస్థాన అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పంచాంగం శ్రవణం చేస్తారన్నారు. భక్తులకు పంచాంగం, స్వామివారి ప్రసాద వితరణ జరుగుతుందని ఏసీ వివరించారు.

మొక్కజొన్న పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏఓ కిరణ్మయి

కాకుమాను: వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె.కిరణ్మయి సూచించారు. మండలంలోని కాకుమాను, బీకే పాలెం, అప్పాపురం, కొమ్మూరు గ్రామాల్లోని పంట పొలాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల ఇప్పటి వరకు పంట నష్టం జరగలేదన్నారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులు పాటు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రకటించడంతో.. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు. పొలాల్లో ఉన్న మొక్కజొన్న, శనగ విత్తనాలు తడవకుండా టార్పాలిన్ పట్టలను కప్పుకోవాలని తెలిపారు. కల్లాల్లో ఉన్న మిర్చి పంటను సాధ్యమైనంత వరకు ఇళ్లకు చేర్చుకోవాలని చెప్పారు. పంటపై ఉన్న కాయలు కుళ్లి పోకుండా ఉండేందుకు ఒక ఎకరాకు 2.5 గ్రాముల మాకోజెబ్ మందును నీటిలో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

తిరునాళ్లను సమన్వయంతో నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు

కొండపాటూరు(కాకుమాను): కొండపాటూరు పోలేరమ్మ తిరునాళ్లను అధికారులందరూ సమన్వయంగా పని చేసి.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు పేర్కొన్నారు. ఏప్రిల్ 11న నిర్వహించనున్న కొండపాటూరులో వేంచేసిన శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తిరునాళ్ల మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి అధికారి తిరునాళ్ల జరిగే మూడు రోజులు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా భక్తులకు తాగునీరు, వైద్యం, మరుగు దొడ్ల ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. సర్పంచ్ కామేశ్వరి, ఎస్ఐ ఎస్.రవింద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, దేవాలయ ఈఓ సురేష్, వివిధ శాఖల అధికారులు, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్రియ బండార్ నేషనల్ అడ్వైజరీ డైరెక్టర్‌గా రవికిరణ్

గుంటూరు రూరల్ : కేంద్రియ బండార్ నేషనల్ అడ్వైజరీ డైరెక్టర్‌గా నీలం రవికిరణ్ ఎంపికైనట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలోని కేంద్రీయ బండార్ మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్‌కుమార్ ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు విడుదల చేసినట్లు వెల్లడించారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలేనికి చెందిన రవికిరణ్ ట్రస్టును స్థాపించి చేసిన సేవా కార్యక్రమాలకు గాను పలు అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన పలు వ్యాపారాలు చేస్తున్న ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రతిష్టాత్మక నెల్సన్ మండేలా నోబుల్ పీస్ అవార్డు అందజేసింది. తెలుగు రాష్ట్రం నుంచి కేంద్రీయ బండార్ నేషనల్ అడ్వైజరీ డైరెక్టర్‌గా ఎంపికైన తెలుగు వ్యక్తి నీలం రవికిరణ్ కావడం విశేషం.

విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలి

- అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ
- కిట్స్ కళాశాలలో ప్రారంభమైన యువ-2023 వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ



ఆకట్టుకున్న విద్యార్థినుల సాంప్రదాయ వస్త్ర ప్రదర్శన

గుంటూరు రూరల్: విద్యార్థులు క్రమ శిక్షణతో లక్ష్యసాధన దిశగా కృషి చేసి.. ఉజ్వల భవిష్యత్తును పొందాలని అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ పేర్కొన్నారు. సోమవారం వట్టిచెరుకూరు మండలంలోని కిట్స్ కళాశాలలో యువ-2023 వేడుకలను ఆమె ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. విద్యార్థులను చూస్తుంటే తన కళాశాల జీవితం గుర్తుకొస్తోందన్నారు. కిట్స్ కళాశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నారని అభినందించారు. వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. భాష్యం విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత గ్రూప్స్‌కి కృషిచేయవచ్చన్నారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సౌకర్యాలను కల్పించటం జరుగుతుందన్నారు. కళాశాల గతేడాది సాధించిన విజయాలు వెల్లడించారు. వివిధ రంగాల్లో విద్యార్థులు చూపిన ప్రతిభాపాటవాలను అభినందించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థినుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆలరించాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత



యాజమాన్యానికి నగదు చెక్ అందజేస్తున్న డాక్టర్ రంగారావు తదితరులు

గుంటూరు రూరల్: జ్ఞానార్జనకు, సమాజ విశ్లేషణకు విద్య ఒక శక్తి వంతమైన సాధనమని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మశీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎం ఫార్మశీ విద్యార్థులకు వజ్జా భార్గవ నాగలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ నగదు ప్రోత్సాహకాలను అందించినట్లు చెప్పారు. ట్రస్ట్ చైర్మన్, ఏఎన్‌యూ జియాలజీ విభాగాధిపతి విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వజ్జా రంగారావు మాట్లాడుతూ.. తన కుమార్తె భార్గవ నాగలక్ష్మి పదేళ్ల క్రితం అకాల మృత్యువాతకు గురైందన్నారు. ఆమె పేరుతో విద్యార్థులకు చేయూతనందించాలని ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. లక్ష రూపాయల చెక్‌ను కళాశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యా సంస్థల అధినేత రంగారావును ఘనంగా సన్మానించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రవి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ సభ్యులతో న్యూరోసర్జన్ బీజాపూరి చంద్రశేఖర్

గుంటూరు మెడికల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒకరు రక్తదానం చేస్తే నలుగురి ప్రాణాలు కాపాడవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి తెలిపారు. గుంటూరు లాలాపేట చినబజారు పాల ఆసుపత్రి వద్ద ఆదివారం రవి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బి. రవికుమార్ 44వ జయంతి సందర్భంగా జరిగిన రక్తదాన కార్యక్రమానికి డాక్టర్ ప్రభావతితో పాటుగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరీఫాతిమా, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ ఎస్ఎమ్ జియాఉద్దీర్, జైళ్లశాఖ సూపరింటెండెంట్ కోన రఘు, డీఎస్పీ సీతారామయ్య, డాక్టర్ చుక్కా రత్నమన్‌మోహన్ అతిథులుగా హాజరయ్యారు. రవి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ముందుకొచ్చి స్వచ్ఛందంగా 206 మంది రక్తదానం చేసి గుంటూరు జీజీహెచ్‌కు అందజేయటం అభినందనీయమని డాక్టర్ ప్రభావతి తెలిపారు. రక్తదాన శిబిరం నిర్వాహకులు, శ్రీబాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన అన్నయ్య డాక్టర్ రవికుమార్ పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాల్ని చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీగారి, కోర్నేలియస్, భార్గవ్, నాగబాబు, కాశీ విశ్వనాథం, అనిల్, వెంకటేశ్వరరావు, జగదీష్, అస్లాం పాల్గొన్నారు.